క్లుప్తంగా

నేడు కూడవెల్లిలో బహిరంగ వేలం

దుబ్బాకరూరల్: రాబోయే మాఘ అమావాస్య ఉత్సవాల సందర్భంగా అక్బర్‌పేటభూంపల్లి మండలం కూడవెల్లి రామలింగేశ్వరస్వామి దేవస్థానంలో 6న ఉదయం 11గంటలకు బహిరంగ వేలం నిర్వహించనున్నట్లు ఆలయ ఈఓ విశ్వనాథశర్మ తెలిపారు. టెంకాయల విక్రయం నూనెగురుగుల విక్రయం, పేలాలు, పుట్నాలు, ప్రసాదాల విక్రయం, కొబ్బరి ముక్కలు పోగుచేయడం, కల్యాణ మండపం కిరాయి, పూల అలంకరణ, క్యూలైన్లు లాంటి వాటికి వేలం నిర్వహించనున్నట్లు తెలిపారు. ఆసక్తి గల వారు పాల్గొనాలని కోరారు.

వైద్యుడికి ఎమ్మెల్యే హరీశ్‌రావు అభినందన



స్వామిని అభినందిస్తున్న హరీశ్‌రావు

సిద్దిపేటకమాన్: రాష్ట్ర డెంటల్ అసోసియేషన్ అధ్యక్షుడిగా ఇటీవల ఎన్నికైన స్థానిక వైద్యుడు స్వామి మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావును ఆదివారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా స్వామిని హరీశ్‌రావు సన్మానించారు. ఆయన వెంట డాక్టర్ సతీశ్, రాజు తదితరులు ఉన్నారు. మున్సిపల్ చైర్మన్ మంజుల రాజనర్స్ ఇంట్లో అయ్యప్ప స్వాములకు నిర్వహించిన భిక్ష కార్యక్రమంలో హరీశ్‌రావు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వాములతో కలిసి భిక్ష చేశారు.

'బాల సాహిత్య' పుస్తకావిష్కరణ



ప్రశంసాపత్రాలతో చిన్నారులు

సిద్దిపేటకమాన్: స్థానిక ప్రెస్‌క్లబ్‌లో ఆదివారం పెండోట బాలసాహిత్య పీఠం పుస్తకావిష్కరణ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో డాక్టర్ నరేశ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కవితా పోటీల్లో వివిధ పాఠశాలలకు చెందిన విద్యార్థులు పాల్గొన్నారని, గెలుపొందిన వారిని సన్మానించి, ప్రశంసా పత్రాలు అందజేసినట్లు చెప్పారు.

స్థానిక ఎన్నికల్లో సత్తా చాటాలి



కేక్ కట్‌చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

జగదేవ్‌పూర్(గజ్వేల్): రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తా చాటేందుకు కాంగ్రెస్ యువనేతలు సిద్ధంగా ఉండాలని నియోజకవర్గ యువజన కాంగ్రెస్ మాజీ అధ్యక్షుడు, తిగుల్ మాజీ సర్పంచ్ భానుప్రకాశ్‌రావు అన్నారు. ఆదివారం పీసీసీ అధికార ప్రతినిధి బండారు శ్రీకాంత్‌రావు జన్మదినం సందర్భంగా జగదేవ్‌పూర్‌లో కేక్ కట్‌చేసి సంబరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటై ఏడాదిలో సీఎం రేవంత్‌రెడ్డి ఎన్నో సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టారని తెలిపారు. నాయకులు రాజు, నర్సింహులు, దాసు, స్వామి, కొండయ్య. వెంకటేశం తదితరులు పాల్గొన్నారు.

కొమ్మెర రాజిరెడ్డికి నేతల నివాళి



విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

హుస్నాబాద్‌రూరల్: హుస్నాబాద్ సింగిల్ విండో చైర్మన్ కొమ్మెర రాజిరెడ్డి వర్ధంతి సందర్భంగా ఆదివారం పొట్లపల్లిలో రెడ్డి సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో వర్ధంతి సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన విగ్రహానికి పూల మాలలువేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ రాజిరెడ్డి రైతులకు బ్యాంకుల నుంచి రుణాలను అందించి ప్రోత్సహించారని కొనియాడారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ కొమ్మెర రాజిరెడ్డి, రవీందర్‌రెడ్డి, శ్రీధర్, తదితరులు పాల్గొన్నారు.

సాగని నాట్లు.. రైతుల పాట్లు

జిల్లాలో రైతుల పరిస్థితి ముందు నుయ్యి.. వెనుక గొయ్యిలా తయారైంది. గత వర్షాకాలంలో సమృద్ధిగా వానలు కురవడంతో చెరువులు, కుంటలు నీటితో పుష్కలంగా నిండాయి. దీంతో భూగర్భ జలాలు కూడా పెరిగాయి. యాసంగిలో పంట దిగుబడి బాగుంటుందనే ఆశతో జిల్లాలోని అధిక శాతం రైతులు వరిసాగుకు మొగ్గుచూపారు. కాని ఇప్పుడు నాట్లు వేయడానికి కూలీలు కరువయ్యారు. దీంతో రైతులు పడరాని పాట్లు పడుతున్నారు.



వరినాట్లు వేస్తున్న రైతులు

- వేదిస్తున్న కూలీల కొరత
- ముదిరిపోతున్న వరినార్లు
- ఎకరానికి రూ.7వేలకుపైగా పెరిగిన ఖర్చు
- ఆందోళనలో అన్నదాతలు

దుబ్బాక: జిల్లాలో 15రోజులుగా వరినాట్లు జోరందుకున్నాయి. దీంతో కూలీలకు డిమాండ్ బాగా పెరిగింది. నాట్లు వేసేందుకు కూలీల దొరకడం కష్టంగా మారింది. రైతులకు ఏమి చేయాలో తెలియని పరిస్థితి నెలకొంది.

ఎకరం నాటుకు రూ.7వేలకు పైనే..

ఇది వరకు ఎకరం నాటువేసేందుకు రైతులకు రూ.5వేలలోపు మాత్రమే ఖర్చయ్యేది. ఈ యాసంగిలో మాత్రం కూలీలకు డిమాండ్ పెరగడంతో ఎకరానికి రూ.7వేల నుంచి రూ.8వేల వరకు ఖర్చు చేయాల్సి వస్తోంది. ఒకరోజు మహిళా కూలీకి రూ.400, పురుషుడికి రూ.700 ఇస్తున్నారు. 10 మంది నుంచి 20 మంది వరకు మహిళలు ఒక జట్టుగా ఏర్పడి ఎకరానికి రూ.5,500 నుంచి రూ.6,500వరకు గుత్తకు తీసుకొంటున్నారు. అలాగే వారి రవాణా ఖర్చులు కూడా రైతే భరించాల్సి వస్తోంది. దీంతో వానాకాలం కంటే ఇప్పుడు ఎకరాలనికి రూ.2వేల వరకు రైతుపై అదనపు భారం పడుతోంది.

ముదిరిపోతున్న నారు

కూలీల కొరతతో రైతులు పోసుకున్న వరినారు ముదిరిపోతోంది. నెలరోజుల నుంచి 40 రోజుల్లో యాసంగిలో వరినాట్లు వేసుకోవాలి. చాలా మంది రైతుల నారుపోసి 40రోజులు దాటేస్తోంది. ఇంకా నాట్లు వేయకపోవడంతో నారు ముదిరిపోతోంది. ముదిరిన నారు వేస్తే దిగుబడిపై చాలా ప్రభావం పడుతుందని రైతులు వాపోతున్నారు.

జిల్లాలో 70వేల ఎకరాల్లో నాట్లు

జిల్లాలో ఈయాసంగిలో 3.50లక్షల ఎకరాల్లో వరి సాగవుతోందనేది వ్యవసాయాధికారుల అంచనా. ఇప్పటి వరకు 70వేల ఎకరాల్లో వరినాట్లు వేయడం పూర్తయింది. ఇంకా 2.80లక్షల ఎకరాల్లో నాట్లు వేయాల్సి ఉంది. 2024 యాసంగిలో జిల్లాలో 3.46 లక్షల ఎకరాల్లో వరిసాగు కాగా ఈ యాసంగిలో సుమారుగా గతంలో కంటే నాలుగు వేల ఎకరాల్లో వరిసాగు అధికమైందని అధికారులు చెప్తున్నారు.

పది రోజులుగా తిరుగుతున్నా..



నా కున్న నాలుగు ఎకరాల్లో నాట్లు వేసేందుకు పది రోజులుగా తిరుగుతున్నా కూలీలు దొరుకతలేరు. నార్లు ముదిరిపోతున్నాయి. ఏం చేయాల్నో తోస్తలేదు. ప్రతిరోజు గుత్తలోల్ల దగ్గరికి పోయి ఎంతగా బతిమిలాడినా నాలు గైదు రోజులంటుండ్రు కాని నాటేసేందుకు రావడం లేదు. నారుపోసి ఇప్పటికే 40రోజులు దాటింది. ఎప్పుడు నాటేస్తనో ఏమో.. చాలా మంది రైతుల పరిస్థితి నా లెక్కనే ఉంది.

– పాతూరి అంజిరెడ్డి, రైతు

నాట్లువేసే యంత్రాలు ఇవ్వాలి



వరినాట్లువేసే యంత్రాలు వస్తేనే తప్ప భవిష్యత్‌లో వ్యవసాయం చేయడం కష్టం అనిపిస్తోంది. ఇప్పుడు నాటేసేందుకు కూలీలు దొరకక చాలా ఇబ్బంది పడుతున్నాం. ఇలా అయితే వ్యవసాయం చేయడం దండుగే.. పంట పండినా చివరకు ఏం మిగులుతుంది? ప్రభుత్వం సబ్సిడీపై నాట్లువేసే యంత్రాలు ఇవ్వాలి.

– కేసుగారి స్వామి, రైతు దుబ్బాక

జిల్లాలో 3.50లక్షల ఎకరాల్లో వరిసాగు



ఈ యాసంగిలో జిల్లా వ్యాప్తంగా 3.50లక్షల ఎకరాల్లో వరిసాగు అంచనా ఉండగా ఇప్పటి వరకు 70వేల ఎకరాల్లో నాట్లు పూర్తయ్యాయి. రైతులకు కూలీల కొరత ఇబ్బందిగా తయారైంది. అందరూ వరి పంటే కాకుండా మార్కెట్‌లో డిమాండ్ ఉన్న పంటలను రైతులు సాగు చేసేకోవాలి. నాటువేసే యంత్రాలు కూడా క్రమంగా జిల్లాలో పెరుగుతున్నాయి.

– రాధిక, జిల్లా వ్యవసాయాధికారి

క్రీడా ప్రాంగణాలు.. బోర్డులకే పరిమితం

- రూ.లక్షలు వెచ్చించినా నిరుపయోగమే
- అటువైపు చూడని అధికారులు



బొడిగేపల్లిలోని క్రీడా ప్రాంగణం

అక్కన్నపేట(హుస్నాబాద్): అక్కన్నపేట మండలం బొడిగేపల్లిలో ఏర్పాటు చేసిన క్రీడా ప్రాంగణం కేవలం బోర్డుకే పరిమితమైంది. ప్రాంగణంలో పిచ్చి మొక్కలు, చెత్తాచెదారంతో నిండిపోయింది. చాలా మంది తమ పశువులను అక్కడే కట్టేస్తున్నారు. మండలంలో మొత్తం 31గ్రామాలు ఉండగా అందులో 25గ్రామాల్లో క్రీడా ప్రాంగణాలను ఏర్పాటు చేశారు. ఈ క్రీడా ప్రాంగణాలు గ్రామాలకు దూరంగా ఉన్నాయి. పాఠశాలల మైదానంలో కేవలం క్రీడా ప్రాంగణాల బోర్డులను ఏర్పాటుచేసి వదిలేశారు. తరవాత వాటిని పట్టించుకున్న దాఖలాలు లేవు. దీంతో ఏ గ్రామానికి వెళ్లినా క్రీడా ప్రాంగణాల బోర్డులే దర్శనమిస్తున్నాయి. ఇప్పటికైనా ఉన్నతాధికారులు దృష్టిసారించి నిరుపయోగంగా ఉన్న ప్రాంగణాలను వినియోగంలో వచ్చేలా చర్యలు తీసుకోవాలని గ్రామీణ ప్రాంత క్రీడాకారులు కోరుతున్నారు.

మున్సిపాలిటీకి శవపేటిక అందజేత



మంత్రి పొన్నం సమక్షంలో శవపేటికను అందజేస్తున్న పూర్వ విద్యార్థులు

- సామాజిక సేవలో పూర్వ విద్యార్థులు
- మంత్రి పొన్నం ప్రభాకర్ సమక్షంలో అందజేత

హుస్నాబాద్: ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చెందిన 1989–90 పదోతరగతి పూర్వ విద్యార్థులు సామాజిక సేవలో మేము సైతం అంటూ ముందుకు వచ్చారు. రూ.80వేలు విలువగల డెడ్‌బాడీ ఫ్రీజర్(శవపేటిక)ను మంత్రి పొన్నం ప్రభాకర్ సమక్షంలో ఆదివారం మున్సిపల్ చైర్ పర్సన్ రజిత, కమిషనర్ మల్లికార్జున్, కౌన్సిలర్ల సమక్షంలో మున్సిపాలిటీకి అందజేశారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు రమణ్ బాబు, మహేందర్, శ్రీనివాస్, రమేశ్, పద్మనాభం, తాజ్ పాష, మహేశ్, వెంకన్న, ఆంజనేయులు తదితరులు ఉన్నారు.

రూ.5.10కోట్లు కేటాయింపు హర్షణీయం

కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి హరికృష్ణ



సమావేశంలో మాట్లాడుతున్న హరికృష్ణ

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): సిద్దిపేట నియోజకవర్గ అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం రూ.5.10కోట్ల నిధులను కేటాయించడం హర్షణీయమని నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి హరికృష్ణ అన్నారు. ఆదివారం పార్టీ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లా అభివృద్ధికి కాంగ్రెస్‌పార్టీ కట్టుబడి ఉందని, అందులో భాగంగానే జిల్లా ఇన్‌చార్జి మంత్రి కొండా సురేఖ ఆధ్వర్యంలో నియోజవర్గానికి 5.10కోట్లు నిధులు కేటాయించారని చెప్పారు. ఒక్క సంవత్సరంలోనే నియోజకవర్గానికి రూ.16కోట్లు కేటాయించారని చెప్పారు. సీఎం రేవంత్ రెడ్డి, మంత్రి కొండా సురేఖ, పొన్నం ప్రభాకర్‌కు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు బుచ్చిరెడ్డి, లక్ష్మి, పాండు, రాజవీర్, రాములు, అంజిరెడ్డి, సదాశివారెడ్డి, మహిపాల్ రెడ్డి, రాములు, శ్రీనివాస్, లతారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అబాకస్‌తో విద్యార్థుల్లో సృజనాత్మకత

అబాకస్ నేర్చుకోవడం వల్ల పిల్లలలో సృజనాత్మకత, జ్ఞాపకశక్తి పెరిగి గణితంపై భయం పోతుందని హరికృష్ణ అన్నారు. విశ్వం అబాకస్, వేదిక్ మ్యాథ్స్ ఆధ్వర్యంలో ఆదివారం సిద్దిపేటలో జిల్లా స్థాయి పోటీలు నిర్వహించారు. పోటీలలో 400 మంది విద్యార్థులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ ఇలాంటి కార్యక్రమాలలో విద్యా ర్థులు పాల్గొనేలా తల్లిదండ్రులు ప్రోత్సహించాలన్నారు. పోటీలలో 30 మంది విజేతలుగా ఎంపిక అయ్యారని, ఫిబ్రవరి 2న జరిగే రాష్ట్రస్థాయి పోటీలలో వారు పాల్గొంటారని నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో విశ్వం అబాకస్, వేదిక్ మ్యాథ్స్ నిర్వాహకులు పాల్గొన్నారు.

నిబంధనలు పాటిద్దాం.. ప్రమాదాలను నివారిద్దాం



గజ్వేల్‌రూరల్: ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పిస్తున్న సీఐ మురళి

పోలీసు అధికారులు

గజ్వేల్‌రూరల్/ప్రశాంత్‌నగర్(సిద్దిపేట)/హుస్నాబాద్‌రూరల్/కొమురవెల్లి(సిద్దిపేట)/సిద్దిపేటకమాన్/మద్దూరు(హుస్నాబాద్): జాతీయ రోడ్డు భద్రతా మాసోత్సవాల సందర్భంగా ఆదివారం పోలీసు అధికారులు పలు చోట్ల ట్రాఫిక్ నిబంధనలపై ప్రజలకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా గజ్వేల్ బస్టాండ్ ప్రాంతంలో నిర్వహించిన కార్యక్రమంలో సీఐ మురళి మాట్లాడారు. ట్రాఫిక్ నిబంధనలు పాటించి ప్రమాదాలను నివారిద్దామని పిలుపునిచ్చారు. మద్యం తాగి వాహనాలు నడిపినా, మితిమీరిన వేగం, రాంగ్‌రూట్‌లో ప్రయాణించడం వల్ల ప్రమాదాలు జరిగే ఆస్కారం ఉందని చెప్పారు. సిద్దిపేటలో రాజీవ్ రహదారి కేసీఆర్ నగర్ డబుల్ బెడ్రూం కాలనీ వద్ద టూటౌన్ సీఐ ఉపేందర్ మాట్లాడుతూ మానవ తప్పిదాల వల్లే ఎక్కువ రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. హుస్నాబాద్‌రూరల్ మండల పరిధిలోని పందిల్ల గ్రామంలో నిర్వహించిన కార్యక్రమంలో ఏఎస్ఐ మల్లేశం మాట్లాడారు. వాహనదారులు జాగ్రత్తలు తీసుకొంటే ప్రమాదాలను నివారించవచ్చన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ రమేశ్, ప్రభాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. కొమురవెల్లి మల్లన్న ఆలయ పరిసరాలలో వాహనదారులు, ఆటో డ్రైవర్లకు చేర్యాల సీఐ శ్రీను అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎస్ఐ రాజు, సిబ్బంది పాల్గొన్నారు. సిద్దిపేటలో వన్ టౌన్ సీఐ వాసుదేవరావు, టూటౌన్ సీఐ ఉపేందర్ మాట్లాడుతూ మద్యం తాగి వాహనాలు నడిపితే కేసులు తప్పవని హెచ్చరించారు. మద్దూరు మండలంలోని లద్నూర్ గ్రామంలో ఏఎస్ఐ విజయ్‌కుమార్ వాహనదారులు తప్పకుండా హెల్మెట్ ధరించాలన్నారు.

'మోడల్' ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

మిరుదొడ్డి(దుబ్బాక): మిరుదొడ్డి తెలంగాణ మోడల్ స్కూల్‌లో 2025–26 విద్యా సంవత్సరానికిగాను 6వ తరగతి నుంచి పదోతరగతుల్లో ప్రవేశం పొందడానికి ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ అర్చన ప్రియదర్శిని ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆరోతరగతిలో వంద సీట్లు, 7, 8, 9, 10వ తరగతుల్లో ఖాళీ అయిన సీట్లకు దరఖాస్తులు చేసుకోవాలని కోరారు. ప్రవేశ పరీక్ష ద్వారానే అన్ని సీట్లను భర్తీ చేస్తామని తెలిపారు. ఫిబ్రవరి 14లోపు దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు. మరిన్ని వివరాలకు తెలంగాణ మోడల్ స్కూల్‌లో సంప్రదించాలని కోరారు.

ఎస్సీ, ఎస్టీ చైర్మన్ వెంకటయ్య సాయం



మాట్లాడుతున్న వెంకటయ్య

మిరుదొడ్డి(దుబ్బాక): అక్బర్‌పేట–భూంపల్లి మండల కేంద్రంలో ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన భారతవ్వ, ఎల్లవ్వ కుటుంబాలను రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య ఆదివారం పరామర్శించారు. రెండు కుటుంబాల సభ్యులకు రూ.5వేల చొప్పున ఆర్థిక సాయం అందించారు. అదే గ్రామంలో అనారోగ్యంతో బాధపడుతున్న కథల మల్లయ్యను పరామర్శించారు. తమ వంతు సాయం చేస్తానని బాధితులకు భరోసా ఇచ్చారు. ఆయన వెంట మాజీ ఉప సర్పంచ్ వడ్ల ప్రభాకర్, బీఆర్ఎస్ గ్రామ అధ్యక్షుడు అయితం శ్రీనివాస్, నాయకులు కిషన్, మహేశ్, పరశురాములు, నర్సయ్య, సాయి సందీప్, సంతోష్, సత్యనారాయణ ఉన్నారు.

మత్తు పదార్థాలపై అప్రమత్తం

ఎస్ఐ విజయ్‌కుమార్



మాట్లాడుతున్న ఎస్ఐ విజయ్‌కుమార్

ములుగు(గజ్వేల్): గంజాయి, ఇతర మత్తుపదార్థాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్ఐ విజయ్‌కుమార్ పిలుపునిచ్చారు. మండలంలోని కొత్తూరులో పోలీస్ కళాబృందం ఆధ్వర్యంలో శనివారం రాత్రి కనువిప్పు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తమ పిల్లల ప్రవర్తనను గమనించవలసిన బాధ్యత తల్లితండ్రులపైనే ఉందన్నారు. సైబర్ నేరాలపై ప్రజలు అవగాహన పెంచుకోవాలని సూచించారు. మూఢనమ్మకాలు, రోడ్డు ప్రమాదాలు, గంజాయి, ఇతర మత్తుపదార్థాల వల్ల కలిగే అనర్థాల గురించి సిద్దిపేట పోలీస్ కళాబృందం సభ్యులు బాలు, రాజు, తిరుమల, తెలంగాణ సాంస్కృతిక సారథి బృందం సభ్యులు కనకయ్య, ప్రకాశ్, హరిప్రసాద్, భిక్షపతి నాటకం, పాటల రూపంలో ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఏఎస్ఐలు మధుసూదన్, అండాలు తదితరులు పాల్గొన్నారు.

క్రీడలతో మానసిక ప్రశాంతత



జట్టుతో సీఐ శ్రీనివాస్

సీఐ శ్రీనివాస్

దుబ్బాకటౌన్: నిత్యం విధుల్లో ఉండే పోలీసులు దుబ్బాక, మిరుదొడ్డి, భూంపల్లి పోలీస్‌స్టేషన్ అధికారులు, సిబ్బంది దుబ్బాకలో ఆదివారం ఫ్రెండ్లీ క్రికెట్ మ్యాచ్ ఆడారు. ఈ సందర్భంగా దుబ్బాక సీఐ శ్రీనివాస్ మాట్లాడుతూ రాష్ట్రంలో పోలీస్ అధికారుల, సిబ్బంది ఆత్మహత్యల నేపథ్యంలో ఒత్తిడిని తగ్గించుకోవడానికి సీపీ డా.అనురాధ ఆదేశాల మేరకు దుబ్బాక సర్కిల్ పరిధిలోని ఎస్ఐలు గంగరాజు, పరశురాములు, హరీశ్ గౌడ్ తమ సిబ్బందితో క్రికెట్ మ్యాచ్ నిర్వహించామన్నారు. క్రీడలతో శారీరకంగాను, మానసికంగాను ఆరోగ్యంగా ఉండవచ్చని చెప్పారు. ఇక నుండి ప్రతీనెల వీలైన సమయంలో సిబ్బందితో క్రీడలు నిర్వహిస్తామని చెప్పారు. అధికారులు, సిబ్బంది ఎలాంటి తారతమ్యాలు లేకుండా ఆటల్లో పాల్గొనడం సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో ప్రొబెషనరీ ఎస్ఐ కీర్తి రాజు, ప్రశాంత్ అలాగే సిబ్బంది హరిసింగ్, రాంజీ, సంతోష్, అశోక్, భిక్షపతి తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

◆ రసవత్తరంగా నీలకంఠ సంఘం ఎన్నికలు



దుబ్బాక: నీలకంఠ సంఘం నూతన కార్యవర్గం ఎన్నికలు ఆదివారం రసవత్తరంగా జరిగాయి. వారం రోజులుగా పట్టణంలో హోరాహోరీగా ప్రచారం జరిగింది. ఎన్నికల్లో మొత్తం 636 ఓట్లకు గాను 500 ఓట్లు పోలయ్యాయి. అధ్యక్షుడిగా బోడ శ్రీహరి తన సమీప అభ్యర్థి మగ్గల భూమలింగంపై ఘన విజయం సాధించారు. ప్రధాన కార్యదర్శిగా కాల్వ శ్రీనివాస్, ఉపాధ్యక్షుడిగా కాల్వ బ్రహ్మేందర్, సహాయ కార్యదర్శిగా అక్కల రాజేశ్వర్, కోశాధికారిగా తుమ్మ రాజేందర్ గెలుపొందారు. నూతన కార్యవర్గాన్ని సంఘం పెద్దలు అభినందించారు.

◆ సీఎంకు గాల్‌రెడ్డి శుభాకాంక్షలు



దుబ్బాక: సీఎం రేవంత్‌రెడ్డిని పీసీసీ ఎన్ఆర్ఐ సెల్ ఇన్‌చార్జి మద్దుల గాల్‌రెడ్డి ఆదివారం కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. రైతు భరోసాతోపాటు పేదలందరికి రేషన్ కార్డులు ఇచ్చేందుకు నిర్ణయం తీసుకోవడంపై సీఎంకు ధన్యవాదాలు తెలిపారు.

◆ సమస్యలు పరిష్కరించాలని వినతి

సిద్దిపేటజోన్: జిల్లాలోని మత్స్యకారుల సమస్యలు పరిష్కరించాలని, సంక్షేమ పథకాలను అందించాలని రాష్ట్ర మత్స్యకార కార్పొరేషన్ చైర్మన్ సాయికుమార్‌కు జిల్లా గంగపుత్ర చైతన్య సమితి కార్యదర్శి రాజు విజ్ఞప్తి చేశారు. హైదరాబాద్‌లో ఆదివారం ఆయనను కలిసి సన్మానించారు. సహకార సంఘాల్లో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని, ఆర్థికంగా వెనుకబడిన గంగపుత్ర సంఘాల బలోపేతం చేసేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు.

◆ అంబేడ్కర్ యువజన సంఘం అధ్యక్షుడిగా ప్రవీణ్‌కుమార్

మద్దూరు(హుస్నాబాద్): అంబేడ్కర్ యువజన సంఘం గ్రామ అధ్యక్షుడిగా మండలంలోని లద్నూర్ గ్రామానికి చెందిన పులి ప్రవీణ్‌కుమార్ ఎంపికయ్యారు. ఉపాధ్యక్షుడిగా పాకాల రజనీకాంత్, ఇలిటం రాజు నియామకమయ్యారు. ఈ సందర్భంగా ప్రవీణ్ మాట్లాడుతూ అంబేడ్కర్ జీవిత చరిత్రను యువకులు ఆదర్శంగా తీసుకోవాలన్నారు.

◆ శ్రీనగర్ వెల్ఫేర్ సొసైటీ నూతన కమిటీ

చేర్యాల(సిద్దిపేట): పట్టణ పరిధిలోని 4వ వార్డు, శ్రీనగర్ కాలనీ వెల్ఫేర్ సొసైటీ నూతన కమిటీ ఎంపిక జరిగింది. ఆదివారం నిర్వహించిన ఈ ఎంపికలో అధ్యక్షుడిగా బర్రె శ్రీనివాస్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా అందె సుధాకర్‌రెడ్డి, కోశాధికారిగా పెంటపర్తి కొండల్‌రెడ్డి, గౌరవ అధ్యక్షుడిగా మెట్టుగారి ఐలయ్య, ఉపాధ్యక్షులుగా చింతల వేణుగోపాల్‌రెడ్డి, బుడిగె శ్రీనివాస్‌గౌడ్, కార్యదర్శులుగా శాడగొండ సంజీవరెడ్డి, బైర నరహరి, సలహాదారులుగా మంద లక్ష్మారెడ్డి, తుపాకుల బాబు, ఆడిట్ కమిటీ సభ్యులుగా గుంటి బుచ్చయ్య, కూరపాటి మల్లేశం, పీఆర్వోగా బొంగు చంద్రారెడ్డి ఏకగ్రీవంగా ఎంపికయ్యారు.

◆ జయవంతం చేయండి



చేర్యాల(సిద్దిపేట): చేర్యాలను రెవెన్యూ డివిజన్ చేయాలంటూ జేఏసీ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట సోమవారం తలపెట్టిన నిరసన కార్యక్రమానికి చేర్యాల, మద్దూరు, కొమురవెల్లి, దూళ్మిట్ట మండలాల నుండి అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని జేఏసీ చైర్మన్ వకుళాభరణం నర్సయ్య పంతులు ఆదివారం పిలుపునిచ్చారు. కలెక్టర్ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తంచేసి కలెక్టర్‌కు మెమోరాండం సమర్పించనున్నట్లు తెలిపారు. కార్యక్రమానికి బీఆర్ఎస్, బీజేపీ, సీపీఎం, టీడీపీ, టీఎమ్మార్పీఎస్, చాంబర్ ఆఫ్ కామర్స్, ప్రజా సంఘాలు, విద్యార్థి సంఘాల నాయకులు పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

◆ నేడు విద్యాసాంస్కృతిక సంబురాలు

దుబ్బాకరూరల్: అక్బర్‌పేటభూంపల్లి మండలం నగరం గ్రామ ఎక్స్‌రోడ్డులోని రామలింగేశ్వర ఫంక్షన్‌హాల్‌లో సోమవారం విద్యా సాంస్కృతిక సంబురాలు నిర్వహించనున్నట్లు మండల విద్యాధికారి అంజయ్య తెలిపారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా రాష్ట్ర మంత్రులు పొన్నం ప్రభాకర్, కొండా సురేఖ హాజరవుతున్నట్లు తెలిపారు. మండలంలోని 33 పాఠశాలల విద్యార్థులు పాల్గొని తమ కళానైపుణ్యాన్ని ప్రదర్శిస్తారని ఆయన చెప్పారు.